


# ఆ యువకుడు....

రాగంపూడి శ్రీనివాస్



లైబ్రరీలో గోడ గడియారం ఎనిమిది గంటలు కొట్టింది.

పుస్తకంలోంచి తల ఎత్తి ఉలిక్కి పడింది సుష్మ. "అప్పుడే ఎనిమిదా?" దాదాపు ఆ మాట పైకి అనేసింది.

త్వరత్వరగా పుస్తకాలు సర్ది లైబ్రేరియన్‌కి ఇచ్చి ఏ పుస్తకం తీసుకెళ్ళాలో అర్థం కాక ర్యాక్ దగ్గరికి వెళ్ళింది. చార్లెస్ డికెన్స్ రాసిన "ది గ్రేట్ ఎక్స్‌పెటేషన్స్" అనే పుస్తకం. ఆ పుస్తకం ఎక్కడ కనబడలేదు. నిరాశగా నడుచుకుంటూ లైబ్రేరియన్ టేబుల్ దగ్గరికి వచ్చింది.

ఇంతలో ఒక వ్యక్తి అక్కడికి వచ్చి "ది గ్రేట్ ఎక్స్‌పెటేషన్స్" పుస్తకం టేబుల్ మీద వుంచి నిశ్శబ్దంగా నిలబడ్డాడు.

సుష్మ సంతోషంతో ఆ పుస్తకం అందుకుంది.

"ఈ పుస్తకం పేరు రాసుకోండి. నేను తీసుకెళ్తాను" అంది.

లైబ్రరీ నుంచి బయటికి వచ్చేసరికి రాత్రి 8.15. లైబ్రరీ నుంచి ఇంటికి ఐదు కిలోమీటర్లే. సుష్మ ఇంగ్లీష్ లిటరేచర్‌లో పిహెచ్‌డి చదువుతోంది. ఆమె రోజుకి కనీసం ఏడు గంటలైనా లైబ్రరీలో కాలం గడపాలి.

"ఇంత ఆలస్యం అయితే అన్నయ్య కోప్పడతాడేమో" అనుకుంటూ నెమ్మదిగా నడుస్తోంది.

రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. మధ్య మధ్యలో ఒక స్కూటరో కారో వెళుతున్నాయి. మున్సిపల్ లైట్ల కాంతి కూడ అంతంత మాత్రమే. ఆ చీకటి నిర్మానుష్యమైన పరిసరాలకి మనస్సులో భయం భయంగా వున్న తనకితాను ధైర్యం చెప్పుకుంటూ నడుస్తోంది.

గత ఆరు నెలలుగా ఆమెని వేధిస్తున్న సమస్య "పిహెచ్‌డి అయిన తరువాత ఏం చెయ్యాలి?" అని ఎం.ఎ. అయిన తరువాత ఉద్యోగం వేటలో పడితే ఉద్యోగం రాలేదు

సరికదా రెండేళ్ళు ఇట్టే గడిచిపోయాయి. చివరికి గతిలేక పిహెచ్‌డిలో జాయినయ్యింది.

తాత్కాలికంగా వెనక్కి చూసింది. రోడ్డంతా నిశ్శబ్దంగా వుంది కాని ఒక యువకుడు మాత్రం పరుగులాంటి నడకతో నడుస్తున్నాడు. సుష్మ మాత్రం నెమ్మదిగా నడుస్తోంది ఆలోచిస్తూ. కాసేపు తరువాత వెనక్కి చూసింది. ఆ యువకుడు చేత్తో సైగలు చేస్తూ పరిగెట్టుకుంటూ వస్తున్నాడు. ఒక్కసారిగా సుష్మకి భయం వేసింది. నడకలో వేగం పెంచింది. పదిహేను అడుగులు వేసి వెనక్కి



చూసింది. అతను కూడా నడకలో వేగం పెంచి తిరిగి చేత్తో ఏదో సైగ చేస్తున్నాడు.

సుష్మకి ఊపిరి ఆగినంత పనయింది. ఇంకో ముప్పై అడుగులు వేస్తే రోడ్డు వస్తుంది అనుకుంటు ఒక్కసారిగా పరుగు మొదలుపెట్టింది. అలా కాసేపు పరిగెడుతూ భుజాల మీంచి జారుతున్న బ్యాగ్‌ని పైకి తోసుకుంటూ ఆయాసపడుతూ వెనక్కి చూసింది. అప్పుడు అతను కూడా పరుగుపెడుతున్నాడు ఇదేదో "డేంజరస్ కేస్" అనుకుంటూ అదే స్పీడ్‌తో రోడ్డు మీదకి చేరింది. రోడ్డంతా ఖాళీగా వుంది. తిన్నగా బస్టాండ్ వైపు పరిగెట్టింది. బస్టాండ్‌లో నిలబడి వెనక్కి ఆత్రంగా చూసింది. ఆ యువకుడు ఎక్కడా కనబడలేదు. బస్టాండ్‌లో జనం లేక నిర్మానుష్యంగా వుంది.

దూరంగా సిటీ బస్ ఒకటి వస్తూ కనిపిస్తోంది. "అమ్మయ్య" అనుకుంది గట్టిగా నిట్టూరుస్తూ. ఇంతలో సడన్‌గా ఆ యువకుడు కనిపించాడు. దిక్కులు చూస్తు అటు యిటూ చూస్తున్నాడు.

సుష్మ గుండె జల్లుమంది.

ఇంతలో బస్సు వచ్చి బస్టాండ్ దగ్గర ఆగింది. ఒక్క ఉదుటులో బస్ ఎక్కుతూ వెనక్కి చూసింది.

బస్ ఎక్కుతున్న సుష్మని పిచ్చివాడిలా చూస్తున్నాడు. 'రాస్కెల్' అని పళ్ళు కొరుక్కుంది.

తరువాత స్టాపులో దిగింది సుష్మ. ఆ స్టేజ్‌లో సుష్మ ఒక్కత్తే దిగడంతో బస్ వెంటనే వెళ్ళిపోయింది రయ్యిమని. బస్‌లోంచి యువకుడు సుష్మని చూసి రన్నింగ్‌లో బస్ దిగాడు.

ఆ యువకుడ్ని చూసి భయంతో వణికిపోతూ మళ్ళీ పరుగు మొదలుపెట్టింది సుష్మ.

ఆ యువకుడు కూడా సుష్మ వెనకాల పరుగుపెట్టసాగాడు.

ఈసారి సుష్మలో కొద్దిగా ధైర్యం చోటుచేసుకుంది. ఎందుకంటే ఆమె ఇప్పుడు తన ఇంటి దరిదాపుల్లోకి వచ్చేసింది.

చివరికి తన ఇంటి గేటు దగ్గర నిలబడి "అన్నయ్యా...అన్నయ్యా..." అని గట్టిగా అరవసాగింది.

ఆ యువకుడు కూడ సుష్మ నిలబడ్డ యింటి దగ్గరకే రాసాగాడు.

సుష్మ ఇంకా గట్టిగా అరవసాగింది. గేటుని కొడుతూ.

సుష్మ అన్నయ్య తలుపు తెరిచి కంగారుగా "ఏమైంది...ఏమైంది..." అన్నాడు.

"ఆ...రాస్కెల్...రాస్కెల్ నన్ను లైబ్రరీ నుంచి వెంటాడుతున్నాడు" అంది రొప్పుతూ. ఆవేశంలో ఆమెకి మాట కూడా సరిగ్గా రావడం లేదు.

"చూడు అన్నయ్య...వాడు చూడు అన్నయ్యా! ఎలా మీద మీదకి వస్తున్నాడో" అంది సుష్మ ఫిర్యాదుగా.

"వాడి పని నే చెప్తాను నువ్వుండు" అంటూ సుష్మ అన్నయ్య ఆ యువకుడి మీదకి లంఘించాడు.

ఆ యువకుడి చొక్కా పట్టుకుని "ఏరా! బాస్టర్డ్! ఆడపిల్లని చూస్తే ఒళ్ళు తెలియదరా...నీకు" అని చెంపమీద పటపట కొట్టసాగాడు.

ఆ యువకుడు మూలుగుతూ ఏదో సైగ చేయసాగాడు.

అవేమి పట్టించుకోకుండా సుష్మ అన్నయ్య ఆ యువకుడ్ని పిడికిలితో కడుపులో గుద్దసాగాడు.

ఆ యువకుడు కనీసం ఎదురు తిరగకుండా ఆ దెబ్బలు భరిస్తున్నాడు.

సుష్మ నిలబడి అదంతా కంగారుగా భయంగా చూస్తోంది. ఆ యువకుడు నోటిమీద చేత్తో చూపిస్తు ఏదో సైగ చేస్తున్నాడు.

సుష్మకి అతని సైగ అర్థమైంది. వెంటనే గట్టిగా అరిచింది "అన్నయ్యా...అతను మూగవాడు..."

సుష్మ అన్నయ్య అదేమి పట్టించుకోవడం లేదు. అతని మీదపడి కొట్టసాగాడు. సుష్మ ముందు కెళ్ళి ఆమె అన్నయ్య భుజం మీద చెయ్యివేసి వెనక్కి లాగి "అన్నయ్యా! అతను మూగవాడు" అంది.

సుష్మ అన్నయ్య అర్థమై కొట్టడం ఆపి విస్మయంగా ఆ యువకుడ్ని చూడసాగాడు.

ఆ యువకుడు లేచి నిలబడి బట్టలు దులుపుకుంటూ సుష్మ బ్యాగ్‌ని చూపిస్తు ఏదో సైగ చేయసాగాడు.

సుష్మకి ఆమె అన్నయ్యకి ఏమి అర్థం కావడం లేదు. బ్యాగ్ వైపు అతనివైపు చూస్తున్నారు పిచ్చిగా.

వాళ్ళకి ఏమి అర్థంకాకపోవడంతో ఆ యువకుడే జేబులోంచి పెన్ను కాగితం తీసి వీధి దీపం కాంతిలో ఏదో చకచక రాసి ఆ కాగితం సుష్మ అన్నయ్యకి ఇచ్చాడు.

ఆ కాగితంలో ఆమె బ్యాగ్‌లో వున్న "ది గ్రేట్ ఎక్స్‌పెక్టేషన్స్" అనే పుస్తకంలో మా అమ్మ నాకు వ్రాసిన ఉత్తరం పెట్టి మర్చిపోయాను. అది నాకు ఇప్పించండి" అని వుంది.

వెంటనే సుష్మ తన బ్యాగ్‌లోంచి ఆ పుస్తకం తీసి అందులో ఆత్రంగా వెతికింది. అందులో ఒక ఇన్‌లాండ్ లెటర్ వుంది. అది తీసి అతని చేతిలో పెట్టి కన్నార్పకుండా అతన్నే చూడసాగింది.

ఆ యువకుడు ఆ ఉత్తరం అందుకుని ఇద్దరి కళ్ళలోకి లోతుగా చూసి వడివడిగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

సుష్మ అన్నయ్యా ముందు తేరుకుని "అయామ్ సారీ!..." అనబోయాడు కాని గద్గదంతో అతని గొంతు పెగలలేదు.

వెళిపోతున్న అతన్ని చూస్తుంటే సుష్మకి ఎందుకో కళ్ళు చెమర్చాయి.